

పూత రాని మామిడి.. రైతన్నలో అలజడి

- వాతావరణ మార్పులే కారణం
- జాగ్రత్తలు పాటిస్తే అధిక లాభాలు



ప్రజాశక్తి- వికోట

పండ్లలో రారాజు మామిడిని పండించే రైతన్నకు ఈ ఏడు పూతసరిగా రాక నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో భూమిలో తేమ శాతం తగ్గింది. దీనికి తోడు వాతావరణంలో వచ్చిన మార్పులతో ఆ ప్రభావం మామిడి సాగు పై పడిందని రైతులు దిగులు పడుతున్నారు. మండలంలో సుమారు 4300ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా ఇటీవల రైతులకు మామిడిలో పూత నుంచి కోత వరకు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. అయితే క్షేత్రస్థాయిలో ఇప్పటివరకు 10శాతం కూడా తోటల్లో పూత రాకపోవడంతో దిగుబడులపై వాటి ప్రభావం పడే పరిస్థితులు నెలకొన్నాయి.

మామిడి పూతదశలో సోకే తెగుళ్లు..

మొదటగా కాండం తొలుసు పురుగు మొక్కలకు ఆశించి కొమ్మలే కాకుండా ఒక్కోసారి మొత్తం చెట్టు కూడా ఎండిపోతుంది. వీటి నివారణకు పాడైన కొమ్మలను తొలగించి అల్యూమినియం ఫాస్పైడ్ బిల్లలను లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్, కాపర్ హైడ్రాక్ సైడ్ పేస్టును చెట్టు కాండానికి పూయాలని ఉద్యాన శాఖ అధికారి లక్ష్మీ ప్రసూన తెలిపారు. అదే విధంగా బూడిద తెగులు సోకడం ద్వారా మొక్కలపై బూడిద రంగు పొడి ఏర్పడుతుందని ఈ పొడిలో శిలీంద్రాలు ఉండడం వలన పూల కాండాలు చివర్లలో తెగులు సోకి పూల గుత్తుల్లో పూలు ఫలదీకరణం చెందకుండా నేల రాలిపోతాయన్నారు. దీని ప్రభావం పిందెల పైన కూడా పడి దిగుబడి పడిపోతుందన్నారు. వీటి నివారణకు నీటిలో కరిగే సల్ఫర్ 80 డబ్లీ పి 3గ్రాములు ఒక లీటరు కలిపి పిచికారి చేయాలన్నారు. పూలు మాడు తెగులు.. దీని ద్వారా మొక్కల్లో పూలు ప్రారంభ దశలో సూక్ష్మమైన నల్లని మచ్చలు ఏర్పడతాయన్నారు. దీని ప్రభావంతో పూలు ఎండి రాలి పోతాయని తెలిపారు. ఈ తెగులు ఆకులకు రెమ్మలకు కాయలకు కూడా సోకుతుందన్నారు. వీటి నివారణకు మొదట ఎండిన కొమ్మలను తొలగించి తోటలను శుభ్రంగా ఉంచుకోవాలని, తెగుళ్లు సోకిన కొమ్మలను కత్తిరించి వాటి ఉధృతిని తగ్గించాలన్నారు.

తొలి దశ నుండి నిమ్మకాయ దశ వరకు తొడమ కుళ్ళు తెగులు ఆశిస్తుందని వీటి పట్ల రైతులు జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చు అన్నారు.



- క్షేత్రస్థాయిలో మామిడి పూతను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

రైతులకు అవగాహన సదస్సులు

ఉద్యాన శాఖ అధికారి లక్ష్మీ ప్రసూన



మామిడి రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వపరంగా రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ముందస్తు శిక్షణ శిబిరాలు క్షేత్రస్థాయిలో నిర్వహించాం. శాస్త్రవేత్తలు చెప్పిన సూచనలు రైతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చును. కాయలకు కవర్లు తొడగడం ద్వారా నాణ్యమైన కాయలను పొంది ఎగుమతి చేయడం ద్వారా అధిక ధరలు లభిస్తాయి. ఎక్కువ కాలం చెట్టులోనే కాయలను నిల్వ ఉంచేందుకు దోహదపడుతుంది. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ కవర్లను పొందేందుకు రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలి. పూత నుండి కాయ వృద్ధి చెందే దశల్లో తగిన మోతాదుల్లో చెట్టుకు నీరు అందించాలి. కాయలను పక్వానికి వచ్చిన వాటిని మాత్రమే కోసి మార్కెట్‌కు తరలించడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చు.

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి

-మహేష్ రెడ్డి, మామిడి రైతు



ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకునేందుకు మార్కెటింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకురావాలి. ఉద్యానశాఖ ద్వారా మామిడి రైతులకు అవసరమైన మందులను ఆర్‌బికెల్లో సబ్సిడీపై అందించాలి. రైతులకు అవసరమైన స్ప్రేయర్లు కాయ కోసే పరికరాలను సబ్సిడీపై అందించాలి. ఒక లీటర్ మందును పిచికారి చేయడానికి సుమారు ఐదు రూపాయలు ఖర్చు వస్తుండంతో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలను నిర్ణయించాలి.

తీరని (పాడిరైతు) కష్టాలు



అమూల్ సంస్థ ప్రతినిధులకు విజయ డెయిరీని అప్పగిస్తూ ఒప్పందం (ఫైల్‌ఫొటో)

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పాలకులు మారినా.. పాడిరైతు కష్టాలు తీరడం లేదు. చంద్రబాబు పాలనలో జిల్లాకే తలమానికమైన విజయ సహకార డెయిరీ మూతపడింది. వైఎస్ఆర్ రాజశేఖర్‌రెడ్డి ఆదుకుంటారనుకున్న పాడిరైతుల కలకలగానే మిగిలింది. 2019 ఎన్నికల ముందు తాను అధికారంలోకి వస్తే పాడిరైతును ఆదుకొనేలా లీటరు రూ.4లు అదనంగా ఇస్తానని, సహకార విజయా డెయిరీనీ పునఃప్రారంభిస్తామంటూ ఎన్నికల వాగ్దానలతో గెద్దెనెక్కిన జగన్ మోహ్మన్‌రెడ్డి తీరా అధికారంలోకి వచ్చాక పాడి రైతులను దాదాపు మరిపోయారనే చెప్పాలి. నేడు, రేపు అంటూ విజయ సహకార డెయిరీ పునర్జీవ పోసుకుంటుందని ఆశలు పెట్టుకున్న జిల్లా పాడిరైతులు, డెయిరీ కార్మికుల ఆశలపై నీళ్ళుజల్లుతూ రూ.33వేల కోట్లు ఆస్తులున్న విజయ డెయిరీ ఆస్తులను అమూల్ సంస్థకు దారాదత్తం చేశారు. ప్రయివేటు డెయిరీల దోపిడినీ అరికట్టేందుకు ప్రభుత్వం అమూల్‌ను తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం చెప్పుకున్నా.. జిల్లాలో ప్రయివేటు డెయిరీల దోపిడి కొనసాగుతోంది. మరో వైపులు అమూల్ సంస్థ దారాదత్తం చేసిన ఆస్తుల్లో శంకుస్థాపనలు మినహా ఎలాంటి నిర్మాణాలు జరగడం లేదు.

జిల్లాలో పాడిరైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిపోయింది. ఇష్టారాజ్యంగా ప్రయివేటు డెయిరీలు పాడి రైతును దోచుకుంటున్నాయి. లీటరకు కనీసం అంటే రూ.40లు ఇస్తే తప్పు గిట్టుబాటు కాని పరిస్థితి. జిల్లాలోని ప్రయివేటు డెయిరీలు రూ.30 నుంచి 32లు మాత్రమే ఇస్తున్నాయి. బిఎంసీల ద్వారా పాలసేకరణ చేస్తున్నా అక్కడా ఇదే పరిస్థితి అంటున్నారు పాడిరైతులు. ఉమ్మడి జిల్లాలో 49 ప్రయివేటు పాలడెయిరీలు ఉన్నాయి. 93 బిఎంలున్నాయి. మరో 18 బిఎంసీలను ఏర్పాటు చేసి మార్చి నాటికి పాల సేకరణ చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. పెరిగిన దాణా, పొట్టుతో పొల్చితే పాడి రైతుకు లీటరు పాలకు ఇచ్చే డబ్బులు ఏమాత్రం సరిపోడం లేదు. మరోవైపు ఇటీవల లంపిన్ వ్యాధి సోకి అనేక పాడి ఆవులు మృతువాత పద్దాయి. పాల దిగుడబడి కూడా తగ్గిపోవడంతో జిల్లాలోని పాడిరైతులు కష్టాలను ఎదుర్కొంటున్నారు.

ఒక్క అడుగు ముందుకు కదలని అమూల్

జిల్లాలోని కేంద్రంలోని విజయ సహకార డెయిరీ అస్తులను అమూల్ సంస్థకు అప్పగిస్తూ జూలై 2023లో జిల్లా కేంద్రమైన చిత్తూరులో బహిరంగ సభ నిర్వహించి ఒప్పదం చేసుకున్నారు. విజయ ఆస్తులను సొంతం చేసుకున్న అమూల్ సంస్థ జిల్లా కేంద్రంలోని విజయ డెయిరీ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. డెయిరీలోని భారీ యంత్రాలు, ఇనుప తుప్పుపట్టిన సామాగ్రిని కోట్లుకు విక్రయించుకొని సొమ్ము చేసుకోవడం, డెయిరీ ఆవరణంలో భారీ చెట్లను నరకివేసి శుభ్రం చేసుకుంది. సంక్రాంతికి పాలశీతలీకరణ చేపట్టి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, పాడిరైతుకు గిట్టుబాటు ధర రాకపోగా విజయ సహకార డెయిరీ ఆస్తులు అప్పనంగా అమూల్ సొంతమైయ్యాయి.



ఎస్పీకి ఘనంగా వీడ్కోలు




ఎస్పీకి వీడ్కోలు పలుకుతున్న చిత్తూరు జిల్లా పోలీస్ సిబ్బంది

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సాధారణ బదిలీలలో భాగంగా చిత్తూరు జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి బదిలీ అయిన సందర్భంగా జిల్లా ఆర్మ్ రిజర్వ్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీకి ఫెరెడ్ వీడ్కోలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బదిలీపై వెళుతున్న ఎస్పీని ఆర్మ్ రిజర్వ్ పోలీసు అధికారులు పెరేడ్ వీడ్కోలు నిర్వహించి ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పోలీసు కవాతు వాహనంలో పోలీస్ ఆఫీస్ నుండి గాంధీ కూడలిపై పూలు చల్లుతూ కవాతు వాహనాన్ని జిల్లా అధికారులు అందరు లాగుతూ ఎస్పీని ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ ఎస్పి జి.నాగేశ్వర రావు మాట్లాడుతూ ఎస్పి మంచి నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వం గల అధికారి అని ఆయన కింద పనిచేయడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, పరిపాలనలో సహాయసహకారాలు అందించిన జిల్లా అధికారులకు హదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అడిషనల్ ఎస్పీ ఎస్ఇబి శ్రీలక్ష్మి, ఎఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వర రావు, డిఎస్పీలు శ్రీనివాస మూర్తి, శ్రీనివాసరెడ్డి, బాబుప్రసాద్, విష్ణు రఘువీర్, శ్రావణ్ కుమార్, ఎఆర్ డిఎస్పీ మురళిధర్, ఇలియాస్ బాష, ట్రైనీ డిఎస్పీ పావన కుమార్, జిల్లా ఇన్స్పెక్టర్‌లు, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి



మండల కేంద్రంలోని సచివాలయం 1లో స్థానిక ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి గైహాజరైన వారికి మెమోలు అందజేయాలని పంచాయతీ కార్యదర్శి సదాశివయ్యని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వం వారు పంపిణీ చేసిన జగనన్న ఆరోగ్య హెల్త్ కార్డులు పంపిణీపై ఆరా తీశారు. జగనన్న హౌసింగ్, సమగ్ర సర్వే వివిధ అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ రెవెన్యూ అధికారి రాజేష్, సర్పంచ్ కొమ్ము వెంకటేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా పంపిణీ చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు ఆదేశించారు. శనివారం నగరి, సత్రవాడలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రధానమంత్రి టీడీ విముక్త్ భారత్ అభియాన్ పథకం కింద టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. అనంతరం నగరి ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధితో బాధపడుతున్నవారు చల్లటి నీరు తాగరాదని, చల్లటి వాతావరణంలో ఉండరాదని సూచించారు. ఏరియా ఆస్పత్రిలో సెక్సువల్ స్కానింగ్ నిర్వహించరాదన్నారు. పామ్ ఎఫ్‌ను సక్రమంగా నమోదుచేయాలన్నారు. పట్టణ పరిధిలో అనధికారిక వైద్యశాలలు నడిపితే తప్పనిసరిగా వారిపై చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.



ప్రభుత్వ ఉద్యోగుల వివరాలు అందించండి: కలెక్టర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తుల పూర్తివివరాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌లతో కలసి 2024- సాధారణ ఎన్నికలు, ఎన్నికలలో వివిధ విభాగాలలో విధులు నిర్వహించుటకు సిబ్బంది వివరాలకు సబంధించి అన్ని శాఖల జిల్లా ఆదికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీకల్లా ప్రతి శాఖలో సిఎఫ్‌యంఎస్ ద్వారా జీతాలు పొందే ప్రతి ఉద్యోగి పూర్తి డేటాను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా ఖజానా కార్యాలయం నుండి ప్రతి కార్యాలయానికి 34 అంశాలతో కూడిన ప్రొఫార్మాలో హెచ్ఓడి మొదలుకొని కిందిస్థాయి సిబ్బంది వరకు ఉన్న ప్రతి ఉద్యోగి వివరాలను అందులో అప్లోడ్ చేయాలన్నారు. ఉద్యోగుల సొంత జిల్లా, నియోజకవర్గం, మండల వివరాలను, ఉద్యోగులు సిఎఫ్ఎంఎస్ నెంబర్, పేస్కేల్, బేసిక్ గతంలో ఎన్నికల్లో విధులు నిర్వహించి ఉంటే ఆ వివరాలను తప్పకుండా నమోదు చేయాలని, ముందుగా ప్రభుత్వ ఉద్యోగస్తులు వివరాలు చివరిలో సిఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు పొందని వారి వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. సోమవారం నుండి శాఖల వారీగా జాబితాను జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగంలో అప్లోడ్ చేయించాలన్నారు. హౌసింగ్, డిఆర్‌డిఏ, డ్వామా పీడీలు పద్మనాభం, తులసి, గంగాభవాని, సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిని డాక్టర్ రాజ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అరుణ, డిపిఓ లక్ష్మి, జిల్లా వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల అధికారులు మురలీకష్ణ, డాక్టర్ ప్రభాకర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు, బీసీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు రబ్బానీ బాష, చిన్నారెడ్డి, మూర్తి, జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మజ పాల్గొన్నారు.

ముగిసిన 'ఆడుదాం ఆంధ్ర' జిల్లాస్థాయి పోటీలు



ముగింపు సభలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, క్రీడాప్రతిభను రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర ఆటలపోటీల ద్వారా వెలికి తీస్తున్నదని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం చిత్తూరులోని మెసానికల్ గ్రౌండ్‌లో జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్ర ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు విచ్చేయగా, రాష్ట్ర విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్ర రెడ్డి, జడ్పీ వైస్‌చైర్ పర్సన్ రమ్య, ఐసిడిఎస్ జోనల్ చైర్‌పర్సన్ శైలజా రెడ్డి, జడ్పీ మహిళా స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతి, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు. జేసి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఆడుదాంఆంధ్ర పోటీలకు ఎంపిక కాబడ్డ క్రీడాకారులను అభినందించారు. ఈనెల 9 నుండి 13వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగు రాష్ట్రస్థాయి ఆడుదాం ఆంధ్రలో గల క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బాడ్మింటన్ వంటి 5 క్రీడలలో పోటీలలో చిత్తూరు జిల్లా పేరు నిలబెడుతూ పోటీలలో రాణించి ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులు పొందాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాబడ్డ క్రీడాకారులకు జిల్లా నుండి వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ ఈనెల 7వ తేదీన విశాఖపట్నంకు ప్రత్యేక బస్సులలో తీసుకొని వెళ్లడం జరుగుతుందన్నారు. వారికి అవసరమైన వసతి, తదితర ఏర్పాట్లు అన్ని చేయడం జరిగిందన్నారు. జిల్లా స్పోర్ట్స్ అధికారి బాలాజీ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, చిత్తూరు ఆర్‌డిఓ చిన్నయ్య, పిఈటిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవ(విచా)రణ పక్కాగా చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఓటర్ల జాబితా సవరణ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పక్కాగా విచారణ చేపట్టాలని ఈఆర్వో, ఆర్డీవో చిన్నయ్య ఏఈఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణలు బిఎల్వోలను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం నగరపాలక కార్యాలయంలో బీఎల్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో, ఏఈఆర్వోలు మాట్లాడుతూ... తప్పులులేని ఓటర్ల జాబితా రూపకల్పనకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రధానంగా ఫారం 6, 7, 8, 8ఎ దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరిగా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ సందర్భంగా సంబంధిత ధ్రువపత్రాలను కచ్చితంగా జత చేయాలన్నారు. సూపర్వైజర్ అధికారులు దరఖాస్తులను, జత చేసిన ధ్రువపత్రాలను సక్రమంగా పరిశీలించి సంతకాలు చేయాలన్నారు. ప్రతి బిఎల్వో వారి పరిధిలోని ఓటర్ల జాబితాను క్షుణంగా పరిశీలించాలని, డోర్ నెంబర్లు లేకపోయినా, తప్పుగా నమోదైన సరిచేయాలన్నారు. సక్రమంగా లేని ఫోటోలను గుర్తించాలన్నారు. కొత్తగా ఓటర్ల నమోదు కోసం వచ్చే దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి అప్లోడ్ చేయాలన్నారు. సమావేశంలో సీఎంఎం గోపి, సూపర్వైజర్ అధికారులు, బిఎల్వోలు పాల్గొన్నారు.

'ఐసిడిఎస్'ని బలోపేతం చేయాలి: సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఐసిడిఎస్‌కి 300 కోట్లు తగ్గించడం సరైనదికాదని, బలోపేతం చేయడానికి నిధులు పెంచాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా, యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శనివారం బంగారుపాలెం ప్రాజెక్టు ముఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో శిశు మరణాలు రేటు తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఐసీడీఎస్ సంస్థను బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేయడానికి నిధులు కోత విధించడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా అంగన్వాడీలు ఎదురుచూసిన కలను కేంద్ర ప్రభుత్వం నీరుగార్చిందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కారం కోసం జరిగిన 42 రోజుల సమ్మెలో అంగన్వాడీలు అనేక రకాల విజయాలు సాధించడం జరిగిందని తెలిపారు. కొన్నిచోట్ల అధికారులు, అధికార పార్టీ నాయకులు బెదిరింపులతో భయపడినప్పటికీ చివరి వరకు సమ్మె కొనసాగించి విజయం సాధించడం జరిగింది. వారందరికీ అభినందనలు తెలియజేశారు. సమ్మె కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 13 మంది చనిపోవడం జరిగిందని వారందరికీ నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా 42 రోజుల సమ్మెలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి అంగన్వాడీలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కోసం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రాజెక్టు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు కార్యదర్శిగా మమత, అధ్యక్షురాలుగా వరలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా లావణ్య, విమల, సహాయకార్యదర్శి జీవరత్నలతో పాటు మరో 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

తహశీల్దార్ హత్యను నిరసిస్తూ..

కలెక్టరేట్ ఎదుట రెవెన్యూ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇంట్లో ఉన్న తహశీల్దార్ రమణయ్యను హత్య చేయడం దారుణమని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఏ హుస్సేన్ అన్నారు. శనివారం ఉదయం విజయనగరం జిల్లా కొండేపల్లిలో తహశీల్దార్ రమణయ్యను హత్య చేయడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నిరసన తెలిపారు. ప్రజలకు సేవలు అందించే అధికారులపై దాడులు దారుణమని నిందితులపై కఠిన చర్యలు తీసుకొని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తహశీల్దార్లు వెంకటేష్, శేషగిరిరావు, పార్థసారథి, హెమద్రిరాజు, మధుసూదన్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం: తహసీల్దార్ దారుణ హత్యకు నిరసనగా శనివారం రెవెన్యూ ఉద్యోగులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. విజయనగరం జిల్లా కొండేపల్లె తహశీల్దార్ రమణయ్యను కొందరు హత్య చేసిన ఘటనపై మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది తీవ్రంగా ఖండించారు. రమణయ్య హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, నిందితులపై తక్షణమే కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని, రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. డిప్యూటీ తహశీల్దారు కౌలేష్, ఆర్ఐ మధు సూధన్, మండల సర్వేయర్ సద్దాం హుస్సేన్, సిబ్బంది వెంకటాచలపతి, కిషోర్, విఆర్ఓలు పాల్గొన్నారు.

నేను ఎవరికీ విరోధిని కాదు

ఎల్లో మీడియా అసత్య ప్రచారాన్ని మానుకోవాలి
ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

ప్రజాశక్తి- కార్వేటినగరం

పేదలకు సంక్షేమాలు అందించి ఆర్థికంగా, రాజకీయంగా సమానత్వాన్ని తీసుకొస్తున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శనివారం నియోజకవర్గంలో నిర్వహించిన సుడిగాలి పర్యటనలో భాగంగా కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కుల, మతాలకు, అతీతంగా రాజకీయంలో అన్ని సామాజిక వర్గాల వారికి సమున్నత స్థానం కల్పిస్తున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రతిఒక్కరూ రుణపడి ఉండాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో జరుగుతున్న మరిన్ని అభివృద్ధి పూర్తి చేయడానికి మూడోసారి కూడా ఎమ్మెల్యే టికెట్ కేటాయించి ఆశీర్వదించారని తెలిపారు. నేను ఎవ్వరికీ విరోధి కాదని. నేను అందరితో సక్యతగా ఉంటున్నా నన్ను ప్రజల నుంచి వేరు చేసేందుకు ఎల్లో మీడియాలు కంకణం కట్టుకున్ని విషప్రచారం చేయడం మంచిది కాదన్నారు. కొన్ని టీవీల్లో బగ్గుమంది బగ్గుమందని ప్రచారం చేస్తున్నారని. నా పై బగ్గుమనేది చంద్రబాబు, రామోజీ, రాధాకృష్ణలకు తప్పా నా నియోజకవర్గంలో ఎలాంటి విబేధాలు లేదన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయాలు ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో ప్రభుత్వ సేవలు అందిస్తున్న ఘనత జగనన్నదేనని, ఇళ్లు లేని పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ప్రతి ఇంటికి పెద్దకొడుకుగా నిలుస్తున్నారని, అలాంటి ప్రభుత్వంతో జగనన్న పంపిన దూతగా నేను ప్రతి కుటుంబానికి కూలివాడిగా పనిచేసే సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎన్ని జన్మలెత్తినా జగనన్నకు, నియోజకవర్గం ప్రజల రుణం తీర్చుకో లేనని అన్నారు. ఈ క్రమంలో భాగంగా కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున మంత్రిని శాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, ధనశేఖరవర్మ, రామూర్తి, సుబ్రమణ్యం, చంద్రశేఖర్, గోపి, మురగయ్య, దొరబాబు, విజయకుమార్, సుందర్‌రాజ్, వెంకటేష్, వెంకటరత్నం పాల్గొన్నారు.


కరపత్రాలను చూపుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

నియోజకవర్గంలో 70 శాతం అభివృద్ధి పనులు చేశా: డిప్యూటీ సీఎం

గంగాధరనెల్లూరు: గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో 70 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరిగిందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. శనివారం నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి కలిసి తాను ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అవకాశం ఇవ్వాలని, చిత్తూరు ఎంపీగా పోటీ చేయవలసిందని విజ్ఞప్తి మేరకు సిఎం ఎమ్మెల్యే టికెట్ కేటాయించినందుకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో తనకు ప్రజలు రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేశానని, ఎమ్మెల్యేగా గెలిస్తే మిగిలిపోయిన 30శాతం అభివృద్ధి పనులు పూర్తి చేయించగలనని పేర్కొన్నారు. మండల వైసీపీ అధ్యక్షులు పూర్ణచంద్రారెడ్డి, వైఎస్ఎంపీపీ హరిబాబు, నేతలు చిన్నమరెడ్డి, గుణశేఖర్ రెడ్డి, మునిరాజారెడ్డి, బలరామిరెడ్డి, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ధరలు పెంచడంలో వైసీపీ నెంబర్ 1

ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: కరెంటు చార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలను ఇబ్బందులు పెట్టడంలో దేశంలోనే ఏపీను వైసీపీ ప్రభుత్వం మొదటి స్థానంలో నిలిపిందని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ విమర్శించారు. శనివారం ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ జగన్ నాడు ఊరూరు తిరిగి, ముద్దులు పెట్టి, పచ్చి అబద్దాలు చెప్పి, ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి విపరీతంగా ధరలు పెంచి అన్నీ వర్గాల ప్రజలను జగన్మోహన్ రెడ్డి మోసాడన్నారు. ఈ బాదుడు ప్రభుత్వంను సాగనంపి సైకిల్ ప్రభుత్వంను తెచ్చుకోవాలని, ప్రజలందరూ సైకిల్‌కి ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. పట్టణ అధ్యక్షులు రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఈఎన్ శ్రీనివాసన్, నూరుల్లా, ఆర్.బాలాజీ, అశోక్, సైదులు, తమీన్, ఖాదర్, కె.బాలాజీ, జ్యోతి నాయుడు, యుగంధర్, శ్రీధర్, సలీం, అల్లి ముత్తు, కరుణ, మది, సలీం పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది టిడిపి ప్రభుత్వమే..!

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

ప్రజాశక్తి - రామకుప్పం: రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించి టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మునస్వామి, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, నరసింహులు, చిన్ని కృష్ణ, రామమూర్తి, భాస్కర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని 89 పెద్దూరు, నారాయణపురం తండా, ముద్దనపల్లి గ్రామాల్లో వికాస సమావేశాల్లో వారు మాట్లాడుతూ.. వైసీపీ కల్లిబోల్లి హామీలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేసిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కనిపించడం లేదన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి సంక్షేమ పథంలో పయనించాలంటే టిడిపి ప్రభుత్వం రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారు. కుప్పంలో చంద్రబాబును ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించడం తధ్యమన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలలో గురుకుల విద్యార్థి

ప్రజాశక్తి- సదుం



స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి వై.పవన్ కుమార్ 67వ నేషనల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గత నెల 24 నుంచి 26 తేదీల్లో జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిన అండర్ -14 బాలురు విభాగంలో జాతీయ జట్టు తరపున కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. జాతీయ జట్టులో పాల్గొని పవన్ కుమార్ అత్యంత ప్రతిభ చూపినందుకు ప్రశంసా పత్రంతో తిరిగి వచ్చారు. శనివారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ పెద్దిరెడ్డి, సదుం జెడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, పాఠశాల ఉపాధ్యాయులు పవన్ కుమార్‌ను అభినందించారు.

మహిళలకు శాశ్వత గృహం

ఇన్‌ఛార్జి తహశీల్దార్ అనిల్ కుమార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మహిళలకు శాశ్వత గృహం కల్పించాలని ఉద్దేశంతో సచివాలయాల్లో ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో చేపడుతున్నట్టు ఇన్‌ఛార్జి తహశీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని బంగారుపాళ్యం 2 సచివాలయాలను గృహహక్కు జరుగుతున్న ఆన్లైన్ విధానాన్ని తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన గృహనిర్మాణ పథకంలో ప్రతి మహిళకు 10 సంవత్సరాలకు గృహహక్కు కలిగిన తర్వాత విలువలు పెంచి రిజిస్ట్రేషన్లకు అనుమతి పొందేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈకార్యక్రమం వల్ల మహిళలకు సొంత ఇంటి కల నెరవేర్చుకుని రిజిస్ట్రేషన్ పొందిన పత్రాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు హామీ పత్రంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అవంతి, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గుడ్లనాయనపల్లి ఉన్నత పాఠశాలకు

జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి



ప్రజాశక్తి- కుప్పం: పలమనేరు పట్టణంలోని మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి 'సైన్స్ అన్వేషణ్' వినూత్న ప్రాజెక్ట్ రూపకల్పన పోటీలలో కుప్పం మండలానికి చెందిన గుడ్లనాయనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇందు, దినేష్, కుప్పం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సంయుక్తంగా రూపందించిన 'ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ఫర్ సాయిల్ మాయిచర్ ప్రిడిక్షన్ ఇన్ అగ్రికల్చర్ సెక్టార్' అనే అంశానికి జిల్లాస్థాయి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందని గుడ్లనాయనపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా వినూత్న రూపకల్పనకు శ్రీకారం చుట్టిన విద్యార్థులు ప్రశంశాపత్రంతో పాటు సర్టిఫికెట్, నగదు బహుమతిగా రూ.12000లు పొందడం జరిగిందన్నారు. జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషోర్ కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు మోహనబాబు, సురేంద్ర రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు.

హెచ్‌ఎంకి ఎంఈఓగా ఉద్యోగోన్నతి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రలు ఎంఈవోగా ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ శనివారం సిఆర్‌సిలో సన్మానసభ నిర్వహించడం జరిగింది. ఎంఈఓ 2 రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు చేపడుతూ ఉద్యోగోన్నతిపై పెనుమూరు ఎంఈఓగా ఉద్యోగోన్నతి పొందడం హర్షించదగ్గ విషయమన్నారు. విధినిర్వహణలో సాధారణ ఉపాధ్యాయులుగా ప్రారంభించి అంచలంచెలుగా ఎదిగి ఎంఈఓగా ఉద్యోగోన్నతి పొందడం చూస్తే ఆయనకు విధుల పట్ల ఉన్న ఆసక్తి అర్థమవుతుందన్నారు. సిఆర్‌పి సుశీల,ఉపాధ్యాయులు పరంధామయ్య, ధనంజయరాజు, లీల, నవీన్, భాస్కర్, చంగయ్య, అహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వైసిపిని వీడి... టిడిపిలో చేరి..

ప్రజాశక్తి- కుప్పం: అధికార వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో శాంతిపురం మండలం మఠం పంచాయతీ వైసిపి సర్పంచ్ మురళి, ఎంపీటీసీ చంద్ర తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో సర్పంచ్ మురళి ఎంపిటిసి చంద్ర చేరారు. పార్టీలో చేరిన ఇరువురిని తెలుగుదేశం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైసిపి కోసం ఎంతో కష్టపడి పనిచేశామని, ఆ పార్టీలో గుర్తింపు లేదన్నారు. వైసిపి ప్రభుత్వం పంచాయితీ నిధులను సక్రమంగా ఇవ్వకపోవడంతో గ్రామాలను అభివృద్ధి చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంతో పాటు కుప్పం అభివృద్ధి చెందాలంటే అది ఒక తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. అలాగే మండలం చెక్కునత్తం పంచాయతీ కనుమపచార్లపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు రాజా, అజిత్ తమ అనుచరాగణంతో కలిసి టిడిపిలో చేరినట్టు మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్ కుమార్ తెలిపారు. శనివారం నాడు పట్టణ పరిధిలోని టిడిపి కార్యాలయం నందు నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షులు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు.



ద(మో)గా డీఎస్సీ



సమావేశంలో మాట్లాడుతున్న మురళీమోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మెగా డీఎస్సీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేస్తోందని తెలుగుదేశం పార్టీ పూతలపట్టు నియోజకవర్గం ఇంచార్జ్ మురళీమోహన్ అన్నారు. శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా ఎన్నికల నోటిఫికేషన్ రానున్న తరుణంలో డీఎస్సీ ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 50లక్షలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు ఉంటే 6000 పోస్టులు భర్తీ చేసేలా మెగా డీఎస్సీ ప్రకటించడం నిరుద్యోగులను మోసం చేయడమే అవుతుందన్నారు. విద్యావ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం నాశనం చేసిందన్నారు.

డీఎస్సీ పేరుతో కొత్త డ్రామాకు తెర

పలమనేరు: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జగన్ రెడ్డి డీఎస్సీ పేరుతో కొత్త డ్రామాకు తెరలేపారని మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి విమర్శించారు. వైసిపి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరిట నోటిఫికేషన్ విడుదల చేయడంపై స్పందిస్తూ ఆయన పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి వదిలింది మెగా డీఎస్సీ కాదని అదొక దగా డిఎస్సీ అని అభివర్ణించారు. రాష్ట్రంలో 50,892 ఖాళీలు ఉంటే కేవలం 6100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను వంచించడమేనన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా చేసిన ఏటా మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఏమయ్యాయో జగన్ సమాధానం చెప్పాలని నిలదీశారు. మరోవైపు నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లేలా మంత్రి బొత్సా కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. యువతను వంచించి రాష్ట్రాన్ని నిరుద్యోగాంధ్రప్రదేశ్ గా జగన్మోహన్ రెడ్డి మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలలో ఓటు అనే ఆయుధంతో బుద్ధిచెప్పి రాష్ట్ర భవిష్యత్తును కాపాడేందుకు ప్రజలు ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

ఆర్డీవోకు వీడ్కోలు సన్మానం

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: బదిలీపై వెళ్తున్న ఆర్డీవో సుజనకు కార్యాలయం సిబ్బంది శనివారం వీడ్కోలు సన్మానం చేశారు. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించి నగరి ఆర్డీవో కార్యాలయానికి తొలి ఆర్డీవోగా రీసర్వే ప్రక్రియ, ఓటర్ల జాబితా సిద్ధం చేయడంపై ఆమె వ్యవహరించిన తీరును ప్రశంసించారు. ఏవో, డీటీ, డీఐవో, సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

అల్పాహారంగా రాగి జావా

ఎంఈఓ 2 రమేష్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం



అల్పాహారంగా రాగి జావా అందిస్తున్నట్టు ఎంఈఓ-2 రమేష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారంగా అందిస్తున్న రాగిజావను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అల్పాహారంగా రాష్ట్ర ప్రభుత్వం రాగిజావను ప్రవేశపెట్టిందని, అందువల్ల పిల్లలకు అదనపు విటమిన్స్ అంది ప్రతిఒక్కరు ఆరోగ్యవంతులుగా ఉండి విద్యావంతులుగా తయారు కావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర, ధనుంజయరాజు, ఉపాధ్యాయులు వాసుదేవ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా గణేష్

ప్రజాశక్తి- కుప్పం : నియోజకవర్గం బీఎస్పీ తరపున పట్టణ పరిధిలోని బాబు నగర్‌కు చెందిన గణేష్ పోటీ చేయనున్నట్టు తెలిపారు. మదనపల్లి పట్టణంలో జరిగిన బీఎస్పీ సర్వసభ్య సమావేశంలో యూపీ రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతం ప్రకటించడం జరిగిందన్నారు. అంతేకాక నియోజకవర్గ పార్టీ అధ్యక్షులుగా సైతం తనను నియమించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ రాబోవు ఎన్నికలలో కుప్పం శాసనసభ్యులుగా బరిలో దిగనున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడుపుతూ అదుపు తప్పి కిందపడటంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. శనివారం పలమనేరు నంఉచి కుప్పం జాతీయ రహదారిలోని జాలారిపల్లి గ్రామసమీపంలో మండలంలోని గంటాపూర్ గ్రామానికి చెందిన బాబు వికోటలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాబును 108 వాహనం ద్వారా స్థానికులు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలోని రాళ్ళబూదుగూరు గ్రామ పంచాయతీ చెందిన సుధాకర్ శెట్టి శుక్రవారం అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి పార్టీ నేతలు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్ తరపున మృతుడి కుటుంబానికి అంత్యక్రియల ఖర్చులకు గాను రూ.10వేలు జడ్పిటిసి శ్రీనివాసులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ నిసార్, సర్పంచ్ లక్ష్మి మురుగేష్, వైస్‌సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

వీధి లైట్ల మరమ్మతులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లిగ్రామ పంచాయతీకి చెందిన రామనపల్లి గ్రామంలో వీధి దీపాలు మరమ్మతులకు గురై ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గురించి తెలుసుకున్న సర్పంచ్ క్రిష్ణారెడ్డి వెంటనే స్పందించిన వీధి లైట్లను రిపేర్ చేయించారు. దీంతో గ్రామస్తులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట ఎంపిటిసి రేణుక, వైస్‌సర్పంచ్ ఈశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు ఉన్నారు.

అలరించిన మాస్టర్ చెఫ్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: రూరల్ మండలం నంబాకం మండలప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డేను పురస్కరించుకొని మాస్టర్ చెఫ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. విద్యార్థులందరూ చెఫ్ వేషధారణలో వంటకాలను రుచిచూసే చెఫ్‌లుగా వ్యవహరించడం అందరినీ ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు వనితాకుమారి, పాండురంగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు చెఫ్‌ల గురించి వివరించారు.

ఐటీ ఆర్మీ కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: నియోజకవర్గంలోని తవణంపల్లి మండలం నారాయణాద్రి కళ్యాణ మండపంలో బెంగళూరు ఐటి విభాగం సభ్యులు, పూతలపట్టు నియోజకవర్గం సోషల్ మీడియా సభ్యులు జగన్ ఐటీ ఆర్మీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పూతలపట్టు నియోజకవర్గ అభ్యర్థి సునీల్ కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేసి జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. స్వరూప్‌రెడ్డి, తేజరెడ్డి, వంశీరెడ్డి, నవీన్ రెడ్డి, సాయిరెడ్డి, నితిన్ రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా సీతాపతి

ప్రజాశక్తి - సదుం: మండల వైఎస్సార్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా మంద సీతాపతిని వైఎస్సార్ పార్టీ జిల్లా కమిటీ నియమించించింది. ఈ సందర్భంగా తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి సీతాపతికి నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పెద్దిరెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, మండల పార్టీ అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు వై.వెంకటస్వామి, కమిటీ మెంబర్లు రాంబాబు, మాధవ తదితరులు ఆయనను అభినందించారు.

'జయహో బీసీ'ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- పలమనేరు: తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ ఆధ్వర్యంలో పలమనేరు పట్టణంలో ఆదివారం చేపట్టనున్న జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పలమనేరు పట్టణ అధ్యక్షులు ఆర్‌బిసి కుట్టీ కోరారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహణపై జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జయహో బీసీ కార్యక్రమానికి తెలుగుదేశం, జనసేన నాయకులతో పాటు ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. బహిరంగ సభలో మాజీ మంత్రి ఎన్.అమర్నాథరెడ్డితో పాటు నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొంటారన్నారు. సమావేశంలో పట్టణ బీసీసెల్ అధ్యక్షులు జె.శ్రీనివాసులు, నాయకులు లోకేష్ ఆచారి, వెంకటరమణ పాల్గొన్నారు.

మరింత గొప్పగా ధర్మ ప్రచారం

ప్రజాశక్తి - తిరుమల

మఠాధిపతులు, పీఠాధిపతుల సలహాలు, సూచనలతో సనాతన హిందూ ధర్మప్రచారాన్ని మరింత గొప్పగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ధార్మిక సదస్సు నిర్వహిస్తున్నట్టు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. తిరుమల ఆస్థాన మండపంలో శనివారం శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు వైభవంగా ప్రారంభమైంది. భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో అనేక ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. తాను తొలిసారి ఛైర్మన్‌గా ఉన్న సమయంలో రెండు సార్లు ధార్మిక సదస్సులు నిర్వహించి పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలు, సలహాలను స్వీకరించి దళిత గోవిందం, మత్స్య గోవిందం, గిరిజన గోవిందం లాంటి కార్యక్రమాల ద్వారా భగవంతుడిని భక్తుల చెంతకు తీసుకెళ్లామని చెప్పారు. స్వామీజీల సూచనలతోనే ఎస్వీబీసీ ఛానల్ ఏర్పాటు చేసి ధర్మ ప్రచారానికి కొత్త అధ్యాయం ప్రారంభించామని గుర్తు చేశారు. సనాతన హిందూ ధర్మ ప్రచారాన్ని చిత్త శుద్ధితో ప్రజలకు చేరువ చేస్తున్న టీటీడీపై అవాస్తవ విమర్శల దాడి జరుగుతోందని స్వామీజీలకు విన్నవించారు. టీటీడీ వైపు నుంచి ఏవైనా పొరబాట్లు జరిగి ఉంటే తగిన సూచనలు, సలహాలు ఇస్తే వాటిని సవరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సదస్సు రెండో సెషన్‌లో బ్రహ్మంగారి మఠం విరజానంద స్వామి మాట్లాడుతూ ధర్మ ప్రచారంలో పిల్లల్ని భాగస్వాములను చేయాలన్నారు. ఏర్పేడు వ్యాసాశ్రమం పరిపూర్ణానందస్వామి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోనూ ధర్మ ప్రచారం జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థిత ప్రజ్ఞానంద సరస్వతి స్వామి, హరితీర్థానంద స్వామి పాల్గొన్నారు.